క్లుప్తంగా

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అశోక్

పోలాకి: గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక అక్షరాస్యతపై సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్‌మేషన్ అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా గుల్లవానిపేట గ్రామంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంస్థ సీనియర్ కో–ఆర్డినేటర్ బొడ్డేపల్లి అశోక్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. మహిళలు, గ్రామీణ యువత డిజిటల్ బ్యాంకింగ్ వినియోగించే క్రమంలో జరుగుతున్న సైబర్ క్రైమ్‌పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏటీఎం పాస్‌వర్డ్‌లు, ఓటీపీ నంబర్లు ఎవరికీ తెలియజేయవద్దన్నారు. జూనియర్ కో–ఆర్డినేటర్ ఎం.అప్పలనాయుడు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకర్లు సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ విశ్వేశ్వరరావు

సారవకోట: జగనన్న తోడు రుణాల కల్పనకు బ్యాంకర్లు సహకరించాలని ఎంపీడీఓ విశ్వేశ్వరరావు అన్నారు. గురువారం మండల సమావేశ మందిరంలో వివిధ బ్యాంకు మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 368 మందికి జగనన్న తోడు రుణాలు మంజూరు చేయాల్సి ఉందని, వాటిని సకాలంలో మంజూరు చేసి సహకరించాలన్నారు. చిరు వ్యాపారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఈ రుణాల విషయంలో బ్యాంకర్లు సకాలంలో సహకరించాలన్నారు. ఏపీఎం గోవిందరాజులు, వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



విజేతలకు కప్ అందిస్తున్న ఎస్ఐ కృష్ణప్రసాదు

సరుబుజ్జిలి: క్రీడాపోటీల్లో రాణించే వారికి మంచి భవిష్యత్ ఉంటుందని ఎస్ఐ కూటికుప్పల కృష్ణప్రసాదు తెలిపారు. మండల కేంద్రంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు గురువారం బహుమతులు అందించారు. ఈ పోటీల్లో గట్టుపల్లి జట్టు ప్రథమ స్థానంలో నిలవడంతో రూ.20వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన సింధువాడ జట్టుకు రూ.10వేలు ప్రైజ్‌మనీ అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డేపల్లి హరి, అత్తులూరి రవికాంత్ పాల్గొన్నారు.

సచివాలయాల్లో ఆధార్ స్పెషల్ డ్రైవ్



ఆధార్ సేవలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సరుబుజ్జిలి: గ్రామ సచివాలయాల్లో ఆధార్ స్పెషల్ డ్రైవ్ సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ పీవీ మురళీమోహన్‌కుమార్ తెలిపారు. చిగురువలస గ్రామ సచివాలయాన్ని గురువారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బంది మువ్మెంట్ రిజిస్టర్ సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు ఆన్‌లైన్ చేసే సమయంలో నిర్దేశించిన డాక్యుమెంట్లు తప్పనిసరిగా దరఖాస్తుదారుని నుంచి తీసుకోవాలన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

కొత్తూరు: యువత క్రీడల్లో రాణించాలని గూనభద్ర ఆర్ఆర్ కాలనీ సర్పంచ్ పెదకోట సాధుబాబు అన్నారు. మన ఊరు–మన సంక్రాంతి కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్ మాట్లాడారు. ఇటువంటి పోటీలు గ్రామీణ క్రీడాకారులకు ఎంతో దోహదపడతాయన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇస్తుందన్నారు. టోర్నీ విజేతగా నిలిచిన గడవపేట జట్టుకు జ్ఞాపికలను సర్పంచ్ అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జి.వరప్రసాదరావు, దారపు శ్రీరామకృష్ణ, ఉపాధ్యాయుడు గిరి తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల నిరసన

నరసన్నపేట: ప్రభుత్వ రంగ సంస్థల్లో ఒకటైన ఎల్ఐసీని ప్రైవేట్‌పరం చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని ఇది సరైంది కాదని, ఎల్ఐసీని బలోపేతం చేయాలని ఎల్ఐసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు మురళీధర్, ఆచారి కోరారు. జీవిత బీమా వ్యాపార జాతీయకరణ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో కేంద్ర ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తూ ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఎల్ఐసీని ప్రైవేట్‌పరం చేయాలని చూస్తే ఆందోళనలు ఉద్ధృతం చేస్తామన్నారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు



ఆమదాలవలసరూరల్: సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన

ఆమదాలవలసరూరల్: పేదల జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థతో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని చీమలవలసలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, ప్రభుత్వం ద్వారా లబ్ధిపొందిన లబ్ధిదారులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ సాంకేతికపరమైన కారణాలతో అర్హులైన లబ్ధిదారులు సంక్షేమానికి దూరం కాకుండా చూడాలని సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల చెంతకు చేరువ చేయడానికి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ఉందనే విశ్వాసాన్ని ప్రజల్లో నిరంతరం పెంపొందించడానికి కృషి చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించి అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించాలన్నారు. ముఖ్యమంత్రి జగన్ అంటే ప్రజలకు ధీమా అని, ఇచ్చిన హామీలను నెరవేర్చడంతోపాటు అమలు చేస్తున్న పథకాలే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి శ్రీరామరక్ష అన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమన్నారు. అర్హత ఉండి పథకాలు రాని కుటుంబాలు ఉంటే వాటిపై ఆరా తీసి అక్కడికక్కడే పరిష్కరించారు. ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే జమ చేస్తున్నామన్నారు. మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ బెండి గోవిందరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ కూటికుప్పల ఉషారాణి, ఎంపీడీఓ ఎం.రేణుక, సివిల్ సప్లయ్ డీటీ అమరనాథ్, ఏఓ మెట్ట మోహనరావు, ట్రాన్స్ ఏఈ బి.రవికుమార్, సచివాలయం సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

మెళియాపుట్టి: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డిశాంతి అన్నారు. మండలంలోని వసుంధర గ్రామంలో గురువారం రెండో రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నవరత్నాల ద్వారా పొందుతున్న లబ్ధిని వివరించారు. ఆటో కార్మికులు, టైలర్లు, డ్వాక్రా మహిళలతో మాట్లాడి వారికి అందుతున్న పథకాలను అడిగి తెలుసుకున్నారు. జగనన్న పాలనలో ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. ప్రతీ ఇంటికి పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని అన్నారు. గ్రామానికి చెందిన సలాన రాజేశ్వరి మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం నవరత్నాలతో జగనన్న నాకు పెద్దన్నయ్య అయ్యాడని, కుటుంబంతో సంతోషంగా ఉన్నామన్నారు. రుద్రపంక్తి భద్రవేణి మాట్లాడుతూ ఎన్నోయేళ్ల నుంచి అద్దె ఇంటిలో నివాసమున్న తనకు జగనన్న ముఖ్యమంత్రి కాగానే ఇల్లు మంజూరైందని, కష్టాలు మర్చిపోయామన్నారు. మళ్లీ, మళ్లీ జగనన్నే మాకు సీఎం కావాలని, రెడ్డి శాంతి ఎమ్మెల్యేగా తమకు తోడుండాలని అన్నారు. జెడ్పీటీసీ గూడ ఎండయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు ఉర్లాన బాలరాజు, సర్పంచ్ సలాన అప్పలనాయుడు, ఎంపీటీసీ సలాన చిట్టి, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బైపోతు ఉదయ్ కుమార్, పల్లి యోగి, పి.జయమునిరావు, గణేష్ ప్రధాన్, ఉర్లాన రవి, శనాపతి రవికుమార్, బాలరాజు, నక్క బాబూరావు, ఎ.రాజశేఖరరెడ్డి, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మెళియాపుట్టి: సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

వేతనదారులే యజమానులు

- జిల్లా డ్వామా పీడీ చిట్టిరాజు

హిరమండలం: ఉపాధి హామీ వేతనదారులే యజమానులని జిల్లా డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు అన్నారు. గురువారం మండలంలోని కొండరాగోలు గ్రామంలోని ముద్దాడ చెంచునాయుడు చెరువులో చేపడుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. వేతనదారులతో మాట్లాడి వారికున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. మూడు వారాలుగా పనిచేసిన పనులకు సంబంధించి వేతనాలు అందలేదని పీడీ దృష్టికి వేతనదారులు తీసుకువచ్చారు. పీడీ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు రూ.19 కోట్లు బకాయి ఉందని, త్వరలోనే వాటిని వేతనదారుల ఖాతాలో జమచేస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. అనంతరం ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రతీ గ్రామంలో 200 మంది చొప్పున వేతనదారులకు పనులకు వెళ్లేలా చూడాల్సి బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. హిరమండలంలో 4,500 మందికి పైబడి వేతనదారులు పనిలో ఉండేలా చూడాలన్నారు. ఈ నెల 23 నుంచి జిల్లాలోని 30 మండలాల పరిధిలోని 912 గ్రామాల్లో సుమారు లక్ష మంది పనిలో ఉండేలా ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. ఉపాధిలో రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో ఉండేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఏపీడీ రవి, జేఈ రవి కుమార్, క్లస్టర్ కో ఆర్డినేటర్ భాస్కర్, ఏపీఓ ఎ.శ్రీనివాసరావు, ఈసీ సంతోష్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్ర సహాయకులు ఉన్నారు.



హిరమండలం: మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు

కొలతల మేరకు ఉపాధి పనులు చేపట్టాలి

ఎల్.ఎన్.పేట: ఉపాధి హామీ పథకం వేతనదారులు ప్రతీ రోజు కొలతల ప్రకారం పనిచేసి రోజుకు రూ.250 వేతనం పొందాలని డ్వామా పీడీ జి.వి. చిట్టిరాజు అన్నారు. మండలంలోని శ్యామలాపురం గ్రామం సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఉదయం 7 గంటలకు పనిలోకి రావాలని వేతనదారులకు సూచించారు. రోజుకు ఆరు గంటలకు తక్కువ లేకుండా పని చేయాలన్నారు. రైతులకు ఉపయోగపడేలా పనులు చేయాలన్నారు. జాబ్‌కార్డు కలిగి ఉన్న అందరూ పనిలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. మార్చి ఆఖరు నాటికి 100 రోజులు పని కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఉపాధి ఏపీఓ వి.శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

భూ రికార్డులు సంపూర్ణంగా ఉండాలి

ఎల్.ఎన్.పేట: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వే పూర్తి చేసుకున్న రెవెన్యూ గ్రామాలకు సంబంధించిన రికార్డులన్నీ సక్రమంగా ఉండాలని సర్వే విభాగం మండల డీటీ కనకమహాలక్ష్మి అన్నారు. మండలంలోని తురకపేట గ్రామ సచివాలయంలో జరుగున్న సర్వే రికార్డుల కంప్యూటరీకరణ విధానాన్ని గురువారం పరిశీలించారు. రైతుల వివరాలు, ప్రభుత్వ భూములు, సర్వే నంబర్లు, కుటుంబ సభ్యుల మధ్య పంపకాలు, వారసత్వం, క్రయ, విక్రయాలకు సంబంధించి భూముల వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని సూచించారు. రైతుల భూములకు సంబంధించి ఎలాంటి పొరపాట్లు చోటు చేసుకోకూడదన్నారు. మండల సర్వేయర్ రెడ్డి గవరయ్య, వీఆర్వో జోగినాయుడు, గ్రామ సచివాలయ సర్వేయర్లు ఉమామహేశ్వరరావు, వి.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కంప్యూటరీకరణను పరిశీలిస్తున్న డీటీ కనకమహాలక్ష్మి

ఏకగ్రీవంగా మండల సర్పంచ్‌ల సంఘం ఎన్నిక



మండల సర్పంచ్‌ల సంఘం ఎన్నికలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

బూర్జ: సర్పంచ్‌ల సంఘ సభ్యులు అందరూ మండల అభివృద్ధికి కలిసి కట్టుగా కృషి చేయాలని ఎంపీపీ కర్నేన దీప, జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షులు ఖండాపు గోవిందరావు ఆధ్వర్యంలో గురువారం మండల సర్పంచ్‌ల సంఘ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మండల సర్పంచ్‌ల సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా చీడివలస గ్రామ సర్పంచ్ బూరి శ్రీరామమూర్తి, అధ్యక్షుడిగా కంట్లాం సర్పంచ్ సూరపు ఉదయ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా కాలపర్తి సర్పంచ్ బి.వి.నాయుడుకు, ప్రధాన కార్యదర్శిగా వైకుంఠపురం సర్పంచ్ బి.వెంకట సత్యం, కార్యదర్శిగా కొల్లివలస సర్పంచ్ జీడి వేణు, ట్రెజరర్‌గా అల్లిన సర్పంచ్ జడ్డు దివ్యను ఎన్నుకున్నారు. మిగతా సభ్యులు అందరూ మెంబర్లుగా ఉంటారన్నారు. ఎన్నికైన సభ్యులు స్పీకర్ తమ్మినేని వాణీసీతారాం కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు, మాజీ ఏఎంసీ గుమ్మడి రాంబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు బి.నారాయణమూర్తి, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకటరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి ధర్మాన పరామర్శ

నరసన్నపేట: మండలంలోని బొరిగివలస, మాకివలసల్లో ఇటీవల మృతి చెందిన పొన్నాన రాజేశ్వరరావు, పల్లి రాంబాబు కుటుంబాలను రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు గురువారం పరామర్శించారు. పొన్నాన రాజేశ్వరరావుతో ఆయనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన కుమారుడు రాంజీ, సోదరులు దాలినాయుడు, తవిటిరాజును పరామర్శించారు. మాకివలసలో పల్లి రాంబాబు కుమార్తెలు త్రివేణి, శర్వాణి, బంధువులు ధర్మ, పోలినాయుడు, రమణను మంత్రి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.



రాంబాబు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పోలాకి: మండలంలోని పిన్నింటిపేట సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ లైన్లను మరమ్మత్తులు చేపట్టనున్నారు. ఈ మేరకు ట్రాన్స్‌కో మెంటెనెన్స్ ఈఈ రాజగోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. పిన్నింటిపేట, బొద్దాం, రహిమానుపురం, బెలమర, గుప్పెడుపేట, డీఎల్‌పురం, ప్రియాగ్రహారం సచివాలయాల పరిధిలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

చల్లవానిపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..

జలుమూరు: చల్లవానిపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి తిలారు రూరల్ ఫీడర్ మరమ్మతులు, చెట్లు కొమ్మలు శుక్రవారం తొలగించనున్నారు. ఈ మేరకు జలుమూరు విద్యుత్‌శాఖ ఏఈ వారాణి వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఉంటుందన్నారు. టెక్కలిపాడు, తిలారు, చిన్నదూగాం, పెద్దదూగాం, రామినాయుడుపేట, రావిపాడు గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

గడువు పెంచాలి

ఆమదాలవలస: ఈ నెల 11న జీఓ నంబర్ 7తో ఉత్తర్వులు విడుదల చేసిందని, ఈ నెల 20లోగా లాగిన్ అవ్వాలని ఆ జీఓలో పేర్కొందని, దీనిని పొడిగించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బి.జనార్దనరావు గురువారం ఒక ప్రకటలో తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్లందరూ వారి ఆధార్, సీఎఫ్ఎంఎస్ నంబర్లు అనుసంధానంతో ఈకేవైసీ లింక్ చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆ జీఓలో పేర్కొందన్నారు. తక్కువ సమయంలో పెన్షనర్లు ఈ పని పూర్తి చేయలేరని అన్నారు. రాష్ట్రంలో లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లు ఉన్నారని, సర్వర్లు పనిచేయకపోవడంతో ఇక్కట్లు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఈ సమస్యను పరిశీలించి పెద్ద మనస్సుతో కాల వ్యవధి పెంచాలని కోరారు. పెన్షనర్లు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా ఈకేవైసీ చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో చాలామందికి ఈ విషయం ఇంకా తెలియక ఈకేవైసీ చేయించుకోలేదన్నారు.

తోలాపిలో పారిశుద్ధ్య పనులు

పొందూరు: మండలంలోని తోలాపిలో గురువారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. రోడ్లుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను జేసీబీతో తొలగించారు. కాలువల్లో మరుగును బయటకు తీశారు. సర్పంచ్ అమ్మాయమ్మ, పంచాయతీ కార్యదర్శి జనార్దనరావు పర్యవేక్షించారు.

పురుషోత్తంనాయుడు ఎన్నికపై హర్షం

కొత్తూరు: ఏపీ ఎన్జీవో రాష్ట్ర సహాధ్యక్షుడిగా వరుసగా ఐదోసారి ఎన్నికైన చౌదరి పురుషోత్తంనాయుడును కొత్తూరు తాలూకా ఎన్జీవో సభ్యులు గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పరుషోత్తంనాయుడు గతంలో మూడు దపాలుగా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేశారన్నారు. పురుషోత్తంనాయుడు ఎన్నిక కావడంతో జిల్లాకు రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు వచ్చిందన్నారు. ఆయన పాలనలో జిలాల్లోని ఎన్జీవోల సమస్యలు పరిష్కారానికి కృషి చేసినట్లు చెప్పారు. హర్షం వ్యక్తం చేసినవారిలో కొత్తూరు తాలూకా ఎన్జీవో అధ్యక్షుడు అల్లు తిరుపతిరావు, అసోసియేట్ అధ్యక్షుడు బి.వెంకటరమణ, ఉపాధ్యక్షుడు దార్లు నరసింహాచారి, సి.హెచ్.నవీన్‌కుమార్, బి.జగన్నాథం, ప్రధాన కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి పి.రజేష్, ఎస్.చంటిబాబు. కె.సాయిరాం, మహిళా సంయుక్త కార్యదర్శి కె.సుధావాణి, కోశాధికారి ఆర్.రాజగోపాలరావు తదితరులు ఉన్నారు.

పది కేంద్రాల్లో కానిస్టేబుల్ పరీక్షలు

నరసన్నపేట: మండల కేంద్రంలో ఈ నెల 22న పోలీస్ కానిస్టేబుల్ ఎంపికకు ప్రిలిమినరీ పరీక్ష కోసం పది సెంటర్లు ఎంపిక చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ రాధిక తెలిపారు. 2,760 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారన్నారు. ఈ మేరకు పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. గురువారం పరీక్ష కేంద్రాలను పరిశీలించి కళాశాలల యాజమాన్య ప్రతినిధులు, స్థానిక సీఐ రాము, ఎస్ఐ సింహాచలంకు పలు సూచనలు చేశారు. కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించనున్నామన్నారు. సీఐ మాట్లాడుతూ ఎంఎల్ఆర్‌నాయుడు, ప్రిజమ్, జ్ఞానజ్యోతి, ఎల్‌వీఆర్, పద్మావతి, డీఆర్ఎన్ డిగ్రీ కళాశాలల్లో, జ్ఞానజ్యోతి, సంపత్ సాయి, పద్మావతి, శాంతా జూనియర్ కళాశాలల్లో ఈ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



ఎంఎల్ఆర్ నాయుడు కళాశాలను పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక

అభివృద్ధి పనులు పూర్తిచేయాలి

- స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులకు స్పీకర్ తమ్మినేని సీతారాం ఆదేశించారు. పట్టణంలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో పంచాయతీరాజ్, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులతో గురువారం సమీక్షించారు. నియోజకవర్గం అభివృద్ధిలో భాగంగా చేపట్టిన పనుల్లో ఇంజినీరింగ్ అధికారులు భాగస్వామ్యం కచ్చితంగా ఉండాలని స్పీకర్ ఆదేశించారు. పనులు జరుగుతున్న తీరును నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించకపోతే సహించేది లేదన్నారు. ఇప్పటివరకు జరుగుతున్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొన్నిపనులు అసంపూర్తిగా గుత్తేదారులు విడిచిపెట్టారని అధికారులు స్పీకర్ దృష్టికి తీసుకువచ్చారు. వారికి నోటీసులు ఇచ్చి వేరేవారికి ఆ పనులు అప్పగించి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల పనులు పెండింగ్ ఉండకూడన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేలా హౌసింగ్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. హౌసింగ్ పీడీ గణపతిరావు, పీఆర్ ఎస్ఈ వి.ఎస్.ఎన్.మూర్తి, ఈఈ గిరిధర్, పొందూరు జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు పప్పల రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాడాన సునీల్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

నిర్వాసితులను ఆదుకోవాలి

కొత్తూరు: వంశధార ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా గూనభద్ర వద్ద నిర్మించిన బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కోసం 400 ఎకరాల భూమిని 460 మంది రైతుల వద్ద గతంలో సేకరించారు. వీరు ఉపాధిని కోల్పోయారని, వీరిని ప్రభుత్వం ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. గూనభద్రలో గురువారం ప్రభావిత కుటుంబాలతో సమావేశం నిర్వహించారు. నిర్వాసితులు హైకోర్టులో కేసు వేయడంతో.. సర్వే చేయాలని కోర్టు ఆదేశించి ఏళ్లు కావస్తున్నప్పటికీ రెవెన్యూ అధికారులు ప్రభావిత కుటుంబాలను గుర్తించలేదన్నారు. 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని కోరారు. ప్రభావిత కుటుంబాల సమస్యలను పరిష్కారం కోసం ఈ నెల 20న తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రతినిధి గంగరాపు ఈశ్వరమ్మ, సంఘం జిల్లా కార్యదర్శి గంగరాపు సింహాచలం, గూనభద్రకు చెందిన చింతాడ రాజారావు, వజ్రగడ్డ శంకరరావు, గూనాపు శంకరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు

బీటీ రోడ్డు నిర్మించాలని వినతి

పాతపట్నం: మండలంలోని దశరథపురం, బైరాగిపేట గ్రామాలకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని వైఎస్సార్‌సీపీ నాయకులు తూలుగు ప్రవీణ్, దక్కర పురుషోత్తం కోరారు. ఈ మేరకు పాతపట్నంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఆల్ ఆంధ్రా రోడ్డు వయా తిడ్డిమి రహదారి నుంచి బైరాగిపేట, దశరథపురం గ్రామాలను కలుపుతూ సరాలి రోడ్డు వరకు సుమారు మూడు కిలో మీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామస్తులు కోరారు. బీటీ రోడ్డు నిర్మాణానికి సంబంధించి ఉన్నతాధికారులతో మాట్లాడుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వినతిప్రతం అందజేసిన వారిలో కొల్లు కృష్ణమూర్తి, రమేష్ బౌరి, సిరిపురం అప్పారావు, శెట్టి బౌరి, దశరథపురం, బైరాగిపేట గ్రామస్తులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రెడ్డి శాంతికి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సంక్షిప్తంగా..

ఘనంగా వేమన జయంతి



వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

హిరమండలం: విద్యార్థి జీవితంలో ప్రాథమిక విద్యాభ్యాసం ఎంతో కీలకమని, బాల్యంలో వేమన పద్యాలు ఉజ్వల భవిష్యత్‌కు పునాది వేస్తాయని ఎంఈఓ కె.రాంబాబు అన్నారు. గురువారం మండలంలోని ధనుపురం ప్రాథమిక పాఠశాలలో వేమన జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ వేమన తన పద్యాల రూపంలో మానవ జీవితం ఎలా ఉండాలో సూచిస్తూ.. సమాజానికి అందించిన సందేశాలు ఆచరణీయమన్నారు. విద్యార్థులకు వేమన పద్యాలపై పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపినవారికి బహుమతులు ప్రదానం చేశారు.

యాజమాన్య పద్ధతులే కీలకం

నరసన్నపేట: వేరుశనగలో అధిక దిగుబడులు రావాలంటే తగిన యాజమాన్య పద్ధతులు చేపట్టాలని ఏఓ కె.సునీత అన్నారు. తామరాపల్లిలో గురువారం వేరుశనగ పంటపై పొలం బడి నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు తగిన సూచనలు చేశారు. పూత దశలో పైర్లు ఉన్నాయని, ఈ సమయంలో గొప్పులు తవ్వాలనిచ అనంతరం జిప్సం వేయాలని సూచించారు. తెగుళ్లు, పురుగులు కనిపిస్తే మందులు పిచికారీ చేయాలని సూచించారు.

సోషల్ ఆడిట్ పూర్తిచేయాలి

నరసన్నపేట: స్వయం శక్తి సంఘాల బలోపేతానికి, వ్యవహారాల్లో పారదర్శకత పెంచడానికి ఈ ఏడాది నుంచి సంఘాల్లో నిర్వహిస్తున్న ఆడిట్‌ను సకాలంలో పూర్తిచేయాలని జిల్లా ఫైనాన్స్ డీఎంజీ బసవరాజు అన్నారు. నరసన్నపేట వెలుగు కార్యాలయంలో ఆయన గురువారం ఈ క్లస్టర్ పరిధిలో నిర్వహిస్తున్న ఆడిట్ వ్యవహారాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి ఆఖరుకల్లా ఆడిట్ పూర్తిచేయాలన్నారు. సంఘాల్లో జీవనోపాధుల మెరుగు, రుణాల చెల్లింపులు, వసూళ్లు, పొదుపు నిర్వహణ, అంతర్గత అప్పులు, బుక్ కీపింగ్ తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని ఆడిట్ చేయాలని, అనంతరం వాటిని ఆన్‌లైన్‌లో ఉంచాలని సూచించారు. ఏసీ కొండలరావు, నరసన్నపేట మహిళా సమాఖ్య అధ్యక్షురాలు చింతు శ్రీదేవి పాల్గొన్నారు.

పీహెచ్‌సీ అభివృద్ధికి కృషి

బూర్జ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి సభ్యులందరూ కృషి చేయాలని ఎంపీపీ కర్నేన దీప, జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో బుధవారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని వైద్యులు పావని, రాజశేఖర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ పీహెచ్‌సీలో అత్యవసర సమయంలో కావాల్సిన మందులను నిల్వ ఉంచాలన్నారు. కుక్క, పాము కాటు మందులు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. రోగులకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ, ఆప్యాయతగా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు–నేడులో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రలను కార్పొరేట్ స్థాయిలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తీర్చిదిద్దడం జరిగిందన్నారు. వైద్యులు మాట్లాడుతూ నూతనంగా నిర్మాణం చేపడుతున్న పీహెచ్‌సీ భవనం త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని కోరారు. ఇన్వర్టర్లు పాడైనందున రెండు ఇన్వెర్టర్లు త్వరగా కొనుగోలు చేయాలన్నారు. కంటిన్‌జెంట్ వర్కర్ రాజుకు పది నెలల జీతం త్వరగా మంజూరు చేయాలన్నారు. పరికరాలు కొనుగోలు చేయాలన్నారు. తహసీల్దార్ ఎస్.రమణారావు, ఎంపీడీఓ రవీంద్రబాబు, ఆస్పత్రి కమిటీ సభ్యులు బూర్జ సర్పంచ్ ఏగు అనురాధ, వావామ్ సర్పంచ్ జి.మంజుల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరుతడి పంటలతో మేలు

సారవకోట: రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని వ్యవసాయాధికారి కేసీహెచ్ వెంకటరావు సూచించారు. గురువారం ధర్మలక్ష్మీపురంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో వరి సాగు చేసిన అనంతరం రైతులు ఆరుతడి పంటలైన పెసర, మినుము, పొద్దుతిరుగుడు తదితర పంటలు వేయాలన్నారు. దీనివల్ల భూసారం పెరగడంతోపాటు ఆదాయం బాగుంటుందన్నారు. పెసర పంటలో వచ్చే తెగుళ్లు, నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు.

60 మందికి వైద్య పరీక్షలు

బూర్జ: మండలంలోని వైకుంఠపురంలో రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు ఎం.ప్రసాద్ (జనరల్ సర్జన్), ఇతర సిబ్బంది పాల్గొని 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.